ప్రకాశం జిల్లా తేదీ:02.09.2025

**ఎరువుల దుకాణాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు...అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు:ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీ A.R.దామోదర్ ఐ.పి.యస్ గారు**

ప్రకాశం జిల్లాలో ముమ్మరంగా సాగుతున్న వ్యవసాయ పనుల నేపథ్యంలో ఎరువులు, పురుగుమందులకు ఉన్న అధిక డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని, కొంతమంది వ్యాపారులు యూరియా నిల్వలు చేసి బ్లాక్ మార్కెట్‌కు విక్రయిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న నేపథ్యంలో ముందస్తుగా జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమై ఆకస్మిక తనిఖీలు చేపట్టింది.

ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీ A.R. దామోదర్, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు మరియు వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో మంగళవారం జిల్లాలోని మొత్తం 121 ఎరువుల దుకాణాలు, ఎరువుల గూడెంములు, PACS గూడెంములు, మరియు పలు ప్రదేశలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో స్టాక్ నమోదు, పీఓఎస్ (PoS) యంత్రాల్లో నమోదైన వివరాలు, పంపిణీ రిజిస్టర్లు, విక్రయ పత్రాలను అధికారులు సమగ్రంగా పరిశీలించారు. యూరియా నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించి, అవి బ్లాక్ మార్కెట్‌కి వెళ్లకుండా అడ్డుకునేందుకు తగిన చర్యలు తీసుకున్నారు.

దుకాణాల్లోని వాస్తవ నిల్వలు మరియు పీఓఎస్ (PoS) యంత్రాల్లో నమోదైన స్టాక్ మధ్య తేడాలు ఉన్నాయా అనే కోణంలో అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. యూరియా సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు, ఎరువుల నిల్వలు మరియు పంపిణీ విధానాలను నిశితంగా పరిశీలించారు.

ప్రతి ఎరువుల దుకాణం తమ స్టాక్ వివరాలను పీఓఎస్ (PoS) యంత్రంలో ఖచ్చితంగా నమోదు చేయాలని, వాస్తవ నిల్వలు మరియు రికార్డుల మధ్య ఎటువంటి తేడాలు ఉండకూడదని అధికారులు స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి తేడాలు ఉంటే, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఎరువులను ప్రభుత్వం నిర్దేశించిన ఎంఆర్‌పి (గరిష్ట చిల్లర ధర)కి మించి అదనంగా విక్రయించరాదని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కృత్రిమ కొరత సృష్టించి, రైతులను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు మానుకోవాలని, సహృదయంతో వ్యవహరించి వారికి అవసరమైన ఎరువులను సకాలంలో అందించాలని హితవు పలికారు. రైతులు మోసపోవకుండా ఉండేందుకు, ప్రతి ఎరువుల బస్తా విక్రయానికి రసీదు ఇవ్వాలని పోలీసు అధికారులు సూచించారు.

ఎరువులు, పురుగుమందుల విషయంలో ఏవైనా అక్రమాలు జరిగినట్లు గమనిస్తే, వెంటనే ప్రజలు దగ్గరలోని పోలీస్ స్టేషన్ లేదా వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, రైతులకు పోలీసులు అండగా ఉంటామన్నారు.

ఈ ఆకస్మిక దాడులు వ్యవసాయ రంగంలో పారదర్శకతను పెంచేందుకు, బ్లాక్ మార్కెట్ విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు దోహదపడతాయని పోలీసులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగిస్తామని హెచ్చరించారు.












